నీరున్నా నిరుపయోగం..!




పిచ్చి మొక్కలతో అధ్వానంగా కాలువ

- అలంకారప్రాయంగా డోల్పులవాగు ప్రాజెక్టు
- పిచ్చిమొక్కలతో నిండిన కాలువలు
- నిర్వహణ లేక పొలాలకు నీరందని వైనం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

తిర్యాణి: అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా మారింది డోల్పుల వాగు ప్రాజెక్టు పరిస్థితి. గిరిజనులు సాగు చేస్తున్న భూములకు నీరందించాలనే లక్ష్యంతో మండలంలోని సుంగాపూర్ ఉమ్మడి గ్రామ పంచాయతీ పరిధిలోని కోర్లోంక గ్రామంలో 2009లో రూ 20.42 కోట్ల వ్యయంతో ప్రాజెక్టు నిర్మించారు. ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు రెండు వేల ఎకరాలకు సాగు నీరందించాలనే లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు. కానీ ప్రాజెక్టు ద్వారా పూర్తిస్థాయిలో నీరందించిన దాఖలాలు మాత్రం లేవు. ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన కాలువలు సరిగా లేక ఇంకా కొన్ని గ్రామాల్లో నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో పాటు కాలువలు ఉన్న చోట తూములు, పిల్ల కాలువలు నిర్మించక పోవడంతో ప్రాజెక్టులో నీరు ఉన్నా రైతులకు మాత్రం ఉపయోగపడటం లేదు.

నిర్వహణ లేక అందని నీరు..

ప్రాజెక్టు కుడి కాలువ పొడవు 30 కిలోమీటర్లు కాగా ఎడమ కాలువ పొడవు 20 కిలోమీటర్లు ఉంటుంది. వీటిపై కేవలం 15 పిల్ల కాలువలు మాత్రమే ఉన్నాయి. కానీ వీటి నిర్వహణ సరిగా లేకపోవడం, కాలువలకు పూర్తిస్థాయిలో సిమెంట్ లైనింగ్ లేకపోవడంతో కాలువల్లో పిచ్చి మొక్కలు, తుంగ పెరిగి అస్తవ్యస్తంగా మారాయి. దీంతో ఆయకట్టు చివరన ఉన్న గిన్నెదరి, మాలగూడ, సాలేగూడ తదితర గ్రామాలకు సాగు నీరు అందడం లేదు. ప్రాజెక్టు సమీపంలో ఉన్న గ్రామాలకు సైతం పూర్తిస్థాయిలో సాగు నీరు పారడం లేదని ఆయా గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు కోర్లోంక గ్రామానికి పడమర దిక్కున కాలువలు లేకపోవడంతో ప్రాజెక్టు పక్కనే వంద ఎకరాలకు సాగు నీరు అందడం లేదు. ఉన్న కాలువలను ఆధునీకరించి, అవసరమైన చోట కొత్త కాలువల నిర్మాణాలను చేపట్టి సాగు నీరు అందించాలని ఇప్పటికే ఆయకట్టు రైతులు పలుమార్లు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



డోల్పుల వాగు ప్రాజెక్టులోని కాలువల నిర్మాణం నాణ్యతగా చేపట్టకపోవడం, వాటి నిర్వహణ సరిగా లేకపోవడంతో కాలువల్లో విరివిరిగా పిచ్చి మొక్కలు పెరిగి అస్తవ్యస్తంగా మారాయి. ప్రాజెక్టు పక్కనే ఉన్నా ఒక్క పంటను పండించడం కూడా కష్టమవుతుంది. కాలువలకు మరమ్మతులు చేపట్టి సాగు నీరందించాలి.

– ఆత్రం భీంరావు, గుడిపేట్

పిల్ల కాలువలు నిర్మించాలి



ప్రాజెక్టుకు ఉన్న కాలువలకు ఆనుకొని పిల్ల కాలువల నిర్మాణాలను పూర్తిస్థాయిలో చేపట్టకపోవడంతో కాలువల నుంచి రైతులే స్వయంగా తాత్కాలిక పిల్ల కాలువలను తవ్వుకొని పంటలకు నీరు అందిస్తున్నారు. అధికారులు వెంటనే నూతన పిల్ల కాలువల నిర్మాణాలు చేపట్టాలి. ఈ విషయంపై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

– మడావి భీంరావు, కోర్లోంక


ఎంపీడీవో రాక ఖాళీగా ఉన్న కుర్చీ

సమయపాలన పాటించరూ..!

లింగాపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని 'సాక్షి' సోమవారం ఉదయం 11.30 గంటలకు విజిట్ చేయగా కార్యాలయంలో ఒక్క అటెండర్ మినహా సిబ్బంది, అధికారులు విధులకు హాజరుకాలేదు. కంప్యూటర్ ఆపరేటర్ల నుంచి ఎంపీడీవో వరకు ఎవరూ సమయపాలన పాటించడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఎంపీడీవో రామేశ్వర్ వారానికి కేవలం రెండు, మూడు రోజులే కార్యాలయానికి వస్తుండడంతో మిగితా సిబ్బంది సమయానికి విధులకు హాజరు కావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.


ఉదయం 11.30 గంటలు దాటినా తెరుచుకోని ఎంపీడీవో గది


సిబ్బంది రాక దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు

క్లుప్తంగా

పరమేశ్వర ఆలయాన్ని దర్శించుకున్న జీఎం దంపతులు


జీఎం శ్రీనివాస్ దంపతులను సన్మానిస్తున్న శివాలయ కమిటీ సభ్యులు

రెబ్బెన: కార్తీక మాసం పురస్కరించుకుని మండలంలోని నంబాలలో గల ప్రసిద్ధ ప్రసన్న పరమేశ్వర ఆలయాన్ని సోమవారం బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ శ్రీనివాస్ దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జీఎం దంపతులు ఆలయంలోని శివలింగానికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి మొదటిసారిగా వచ్చిన సందర్భంగా జీఎం దంపతులను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. ఆలయ విశిష్టతను జీఎం దంపతులకు వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చెన్న సోమశేఖర్, ఆలయ కమిటీ సభ్యులు మాసాడి జగన్, చెన్న సాయికుమార్, గ్రామస్తులు అడు శంకరయ్య, ఇంగు శశికిరణ్, పిరిసింగుల రాజన్న, బొమ్మినేని లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పార్థివ లింగపూజ

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో సోమవారం అర్చకులు ముదిగొండ రాజశేఖర శర్మ ఆధ్వర్యంలో పార్థివలింగపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు, మహిళలు శివలింగానికి బిల్వపత్రి, పుష్పాలతో ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. కార్యక్రమంలో అర్చకులు నరేశ్ శర్మ, సంతోష్ శర్మ, శివప్రసాద్ శర్మ, మహేశ్ శర్మ, చంద్రశేఖర శర్మ, భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన

లింగాపూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం పోలీస్ కళాజాత బృందం వారు నూతన చట్టాలు, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియమాలు, సైబర్ మోసాలు, షీ టీమ్స్, గంజాయి నివారణ, సీసీ కెమెరాల ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్సై ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయని, సైబర్ నేరగాళ్ల మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు. బాధితులు 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు రాంచందర్, రోహిత్, వెంకటేశ్, రజిత, విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లలు పుస్తకాలు చదవాలి

రెబ్బెన: పుస్తకాలను చదవడం ద్వారా పిల్లల్లో జ్ఞానం పెరుగుతుందని గంగాపూర్ ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయుడు రవి అన్నారు. సోమవారం పాఠశాలలో జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్య, పుస్తక పఠనం ప్రాముఖ్యతను వివరించారు. మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ దేశానికి అందించిన సేవలను గుర్తు చేశారు. విద్యార్థులు పుస్తకాలను చదవటం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. అనంతరం విద్యార్థుల చేత కథల పుస్తకాలు చదివించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్, సంజీవ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

సెపక్‌తక్రా రాష్ట్ర కమిటీలో చోటు

రెబ్బెన: సెపక్‌తక్రా రాష్ట్ర కమిటీలో కుమురం భీం జిల్లాకు చెందిన ఇద్దరికి చోటు లభించింది. రెబ్బెన మండలంలోని గోలేటికి చెందిన ఆర్.రామకృష్ణారెడ్డి, కుమ్మరి మల్లేశ్‌ను రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో రాష్ట్ర అసోసియేషన్ సమావేశంలో ఎన్నిక నిర్వహించారు. జిల్లాకు ప్రాధాన్యత కల్పిస్తూ జాతీయ స్థాయి సీనియర్ క్రీడాకారులకు చోటు కల్పించడంపై ఒలింపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.నారాయణరెడ్డి, సెపక్‌తక్రా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.తిరుపతి, షార్ప్ స్టార్ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, పీఈటీ భాస్కర్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

పత్తికి రూ.12వేలు మద్దతు ధర కల్పించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: రైతులు పండిస్తున్న పత్తి పంటకు క్వింటాలుకు రూ.12వేలు గిట్టుబాటు ధర కల్పించాలని, తేమ పరీక్ష లేకుండా సీసీఐ, ప్రైవేటు జిన్నింగ్ మిల్లుల ద్వారా కొనుగోలు చేయాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్ డిమాండ్ చేశారు. పత్తి రైతులకు న్యాయం చేయాలని సంఘం ఆధ్వర్యంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల విభాగంలో రైతులతో కలిసి కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం సమర్పించారు. పురుషోత్తం, బాలేశ్, ప్రశాంత్, సాయికృష్ణ, వెడ్మ వెంకటేశ్, గోపాల్, సతీశ్, అరుణ్, మహేశ్, శ్రీపాల్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కాగడహారతి


కాగడహారతి ఇస్తున్న భక్తులు

ఆసిఫాబాద్‌అర్బన్: పవిత్ర కార్తికమాసాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రంలోని శ్రీ కేశవనాథస్వామి ఆలయం, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో కాకడ హారతులను వెలిగించి, భజనలు చేశారు. అర్చకులు ఒజ్జల నరేష్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం చేశారు. అనంతరం ఉదయం 5 గంటలకు పట్టణంలో హారతులతో నగర సంకీర్తన చేస్తూ పలు ఆలయాలు సందర్శించారు. కార్తిక సోమవారం పర్వదినం సందర్భంగా శివాలయాల్లో భక్తుల రద్దీ పెరిగింది. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గంగాహారతి..

పవిత్ర కార్తికమాసం పురస్కరించుకొని సోమవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని ఆలయాలు భక్తులతో కిక్కిరిసి పోయాయి. పంచపర్వాల సందర్భంగా ఉదయం నాలుగు గంటల నుంచి స్థానిక పెద్దవాగులో భక్తులు స్నానమాచరించారు. ఉపవాస దీక్షలు, దీపదానాలు, తులసీ వివాహాలతో పట్టణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. పెద్దవాగులో సాయంత్రం గంగాహారతి ఇచ్చి దీపాలు వదిలారు. బ్రాహ్మణవాడ కేశవనాథస్వామి ఆలయం, శివకేశవ ఆలయాల్లో కాగడహారతులతో పట్టణంలో భజనలు చేసుకుంటూ నగర సంకీర్తన చేపట్టారు.


పెద్దవాగులో దీపాలు వదులుతున్న మహిళలు

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

కౌటాల: విద్యతోనే అభివృద్ధి సాధ్యమని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ తస్లీమా బేగం అన్నారు. కౌటాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం జాతీయ విద్యా దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు చదువులో రాణించాలన్నారు. విద్యార్థులు చదువును నిర్లక్ష్యం చేయవద్దని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు అశోక్, ఆంజనేయులు, మోతిలాల్‌నాయక్, ప్రకాశ్, శ్రీనివాస్‌నాయక్, పాపయ్య, రజిత, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మట్కా ఆడుతున్న ముగ్గురి అరెస్టు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని గాంధీపార్క్ వద్ద సోమవారం దాడులు నిర్వహించి మట్కా ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. మూడు సెల్‌ఫోన్‌లను సీజ్ చేశామని పేర్కొన్నారు. ఎవరైనా మట్కా ఆడినట్లు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందజేయాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. మట్కా ఆడటం వల్ల పేద కుటుంబాలు చిద్రం అవుతున్నాయని, యువత పెడదారి పడుతుందన్నారు.

చెత్త ట్రాక్టర్‌తో నిరసన

బెజ్జూర్: పెండింగ్ వేతనాలు చెల్లించాలని సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట చెత్తతో నిండిన ట్రాక్టర్‌తో పారిశుధ్య కార్మికులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఆరు నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. ప్రత్యేకాధికారి లేకపోవడంతో దసరా, దీపావళి పండగలకు కూడా వేతనాలు అందలేదని తెలిపారు.

'భారీ వాహనాలు వేరే మార్గంలో వెళ్లాలి'

కౌటాల: సిర్పూర్(టి) మండలం టోంకిని సిద్ధి హనుమాన్ మహాపాదయాత్ర నేడు ఉండడంతో కౌటాల–కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై నుంచి భారీ వాహనాలకు అనుమతి లేదని కౌటాల ఎస్సై మధుకర్ సోమవారం తెలిపా రు. కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాల వాహనదారులు ఈజ్‌గాం, డబ్బా మార్గాల్లో కాగజ్‌నగర్‌కు వెళ్లాలని సూచించారు. పాదయాత్రగా వస్తున్న భక్తులకు వాహనదారులు సహకరించాలని కోరారు.

వంద రోజులు పని కల్పించాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

వాంకిడి: జాబ్‌కార్డు కలిగి ఉన్న ప్రతీ కుటుంబానికి వంద రోజులు ఉపాధి కల్పించాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని పిప్పర్‌గోందిలో నిర్వహించిన ఉపాధిహామీ గ్రామ సభలో పాల్గొని మాట్లాడారు. ఉపాధిహామీ పథకంలో అనుమతించిన పనులను గ్రామస్తులకు వివరించారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతీ రైతు పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ భూముల్లో అభివృద్ధి పనులు చేసుకుని లాభం పొందాలన్నారు. ప్రత్యేక ప్రణాళికతో కూలీలకు ఉపాధి కల్పించాలని సిబ్బంది ఆదేశించారు. అనంతరం పిప్పర్‌గోంది, పాతగూడ గ్రామ పంచాయతీలలో ఏర్పాటు చేసే నర్సరీల స్థలాలను పరిశీలించారు. వచ్చే ఏడాది డిమాండ్‌కు అనుగుణంగా మొక్కల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను సూచించారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న సమగ్ర సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో ఈసీ మోసిన్, పంచాయతీ కార్యదర్శి నియమాలిక, అన్నపూర్ణ, టీఏ అంబాజి తదితరులు పాల్గొన్నారు.

'కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం'


సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ నాయకులు

బెజ్జూర్: పార్టీ కోసం కష్టపడ్డ ప్రతీ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని ఉప రిటర్నింగ్ అధికారి ధోని శ్రీశైలం, మాజీ జెడ్పీటీసీ పాల్వాయి సుధాకర్ రావు అన్నారు. బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపెల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబుల ఆదేశాల మేరకు ఎన్నికల ఇన్‌చార్జి ఎలుముల మల్లయ్య ఆధ్వర్యంలో బీజేపీ సంస్థాగత ఎన్నికల నిర్వహణలో భాగంగా సోమవారం మండల కేంద్రంలో సమావేశాన్ని నిర్వహించారు. ధోని శ్రీశైలం మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ కార్యకర్తలు సభ్యత్వ నమోదులో ముందుండాలన్నారు. మాజీ ఎంపీపీలు కొప్పుల శంకర్, కొంద్ర మనోహర్ గౌడ్, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత సాధించాలి

కౌటాల: ప్రతి ఒక్కరు ఆర్థిక అక్షరాస్యత సాధించాలని ముత్తంపేట తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని వీరవెల్లి గ్రామంలో టీజీబీ బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీమా పథకాలు చేసుకుంటే కుటుంబాలకు ధీమా ఉంటుందని తెలిపారు. మహిళ సంఘాలు బకాయిలు చెల్లించి తిరిగి రుణాలను పొందాలన్నారు. వినియోగదారులు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళా సంఘాలు ఆర్థికంగా వృద్ధి చెందాలని తెలిపా రు. అనంతరం కళాజాత బందం సభ్యులు పలు పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ మహేశ్, విలాస్, కళాజాత సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి ప్రధాన మంత్రి జన జాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్ యోజనలో భాగంగా ఆదివాసీ గిరిజన ప్రాంతాల్లో వసతులు కల్పించేందుకు సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనులకు పక్కా గృహాలు, విద్యుత్ సౌకర్యం, తాగునీరు, ఆయుష్మాన్ భారత్ కార్డులు, గ్రామాలను మండల, జిల్లా కేంద్రానికి అనుసంధానం చేసే విధంగా రహదారుల నిర్మాణం, మొబైల్ కనెక్టివిటీ, ఇంటర్నెట్, ఆరోగ్య పోషకాహార, విద్య, నైపుణ్య శిక్షణ వంటి సదుపాయాలు కల్పించే ప్రతిపాదనలను రూపొందించాలన్నారు. మూడు రోజుల్లో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రమాదేవికి అందించాలని ఆదేశించారు. ఆదివాసీ గ్రామాల సమస్యలపై సమీక్షించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

ఏరియాను సందర్శించిన క్వాలిటీ జీఎం


క్వాలిటీ జీఎంను సన్మానించి మొక్క అందజేస్తున్న ఏరియా జీఎం శ్రీనివాస్

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాను సోమవారం కార్పొరేట్ క్వాలిటీ జీఎం రవికుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీని సందర్శించారు. సీహెచ్‌పీ ద్వారా సింగరేణి సరఫరా చేస్తున్న బొగ్గు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే వినియోగదారులకు సరఫరా చేస్తున్న బొగ్గు నాణ్యతకు సంబంధించిన విషయాలను చర్చించి తగిన సూచనలు అందించారు. ఏరియాలో నాణ్యతతో కూడిన బొగ్గును ఉత్పత్తి చేయాలని, వినియోగదారుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నాణ్యతతో కూడిన బొగ్గును అందించేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం ఏరియా జీఎం శ్రీనివాస్‌తో నాణ్యత పరమైన విషయాలపై చర్చించారు. అనంతరం క్వాలిటీ జీఎంను ఏరియా జనరల్ మేనేజర్ శాలువాతో సన్మానించి మొక్కను అందజేశారు. కార్యక్రమాల్లో ఏరియా ఇంజినీరు భీంరావు జాడే, సెక్యూరిటీ అధికారి ఉమాకాంత్, క్వాలిటీ ఇన్‌చార్జి రవికుమార్, సీహెచ్‌పీ ఎస్ఈ కోటయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుచేయాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వీవోఏలు

ఆసిఫాబాద్‌అర్బన్: ఐకేపీలో పనిచేస్తున్న వీవోఏలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుచేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం 48 గంటల ధర్నా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వీవోఏలకు స్త్రీనిధి ఇన్సెంటీవ్‌తోపాటు గ్రామ సంఘం నుంచి రూ.3000 గౌరవ వేతనం చెల్లించాలన్నారు. మూడు నెలల రెన్యూవల్ పద్ధతి తీసివేసి, హామీ మేరకు రూ.20వేల వేతనం ఇవ్వాలన్నారు. రూ.20 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. రాష్ట్ర కమిటీ సభ్యురాలు రమ, జిల్లా అ ధ్యక్షులు బుద్దు, కార్యదర్శి రోజా, ధన్‌రాజ్, సంతోష్, తిరుపతి, వెంకటేశ్, అన్నపూర్ణ, భరత్, రవీందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని సర్‌సిల్క్ వార్డు నం.3లోని ప్రాథమిక పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ఎస్పీఎం ఆధ్వర్యంలో స్కూల్‌బ్యాగులు, నోటుపుస్తకాలను పంపిణీ చేశారు. విద్యార్థులు చదువుపై మరింత దృష్టి పెట్టి బాగా చదువుకోవాలని ఎస్పీఎం జీఎం గిరి అన్నారు. పేద విద్యార్థులకు అభ్యున్నతికి ఎస్పీఎం కృషి చేస్తుందన్నారు. కౌన్సిలర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.